బోణీ వాళ్లదే

రెండో టీ20లో దక్షిణాఫ్రికా విజయం

డక్‌వర్త్‌తో టీమ్‌ఇండియాకు దెబ్బ ● రింకూ, సూర్య పోరాటం వృథా

ఇటీవల ఆస్ట్రేలియాపై టీ20 సిరీస్ నెగ్గిన భారత జట్టు.. దక్షిణాఫ్రికా పర్యటనను పరాజయంతో ప్రారంభించింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితం తేలిన పోరులో సఫారీ టీమ్ పైచేయి సాధించింది. బ్యాటింగ్‌లో రింకూసింగ్, సూర్యకుమార్ హాఫ్‌సెంచరీలతో మంచి స్కోరు చేసినా.. వరణుడి కారణంగా లక్ష్యాన్ని మార్చడంతో దక్షిణాఫ్రికాకు అదనపు ప్రయోజనం చేకూరింది! మన బౌలర్లు ప్రయత్నించినా.. సఫారీ హిట్టర్లను అడ్డుకోలేకపోవడంతో టీమ్‌ఇండియాకు పరాజయం తప్పలేదు!

హెన్రిక్స్ (49)

పోర్ట్ ఎలిజబెత్: వర్షం అంతరాయం మధ్య సాగిన పోరులో దక్షిణాఫ్రికా దుమ్మురేపింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి పోరు వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దు కాగా.. రెండో మ్యాచ్‌కూ వరణుడు అడ్డుపడ్డాడు. మంగళవారం డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ముగిసిన రెండో టీ20లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. రింకూసింగ్ (39 బంతుల్లో 68 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్సర్లు), సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 56; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్‌సెంచరీలు చేయగా.. హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ (29; 4 ఫోర్లు, ఒక సిక్సర్) పర్వాలేదనిపించాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (0), శుభ్‌మన్ గిల్ (0) సున్నాలు చుట్టగా.. జితేశ్ శర్మ (1) ప్రభావం చూపలేకపోయాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కొట్జీ 3 వికెట్లు పడగొట్టాడు. భారత ఇన్నింగ్స్‌లో మరో మూడు బంతులు మిగిలుండగా.. వర్షం అంతరాయం కలిగించడంతో.. డకవర్త్ లూయిస్ ప్రకారం దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 15 ఓవర్లలో 152గా నిర్ణయించారు. ఛేదనలో సఫారీ జట్టు 13.5 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు చేసింది. రిజా హెన్రిక్స్ (27 బంతుల్లో 49; 8 ఫోర్లు, ఒక సిక్సర్), మార్క్‌రమ్ (30; 4 ఫోర్లు, ఒక సిక్సర్) రాణించారు. భారత బౌలర్లలో ముఖేశ్ రెండు, సిరాజ్, కుల్దీప్ చెరో వికెట్ పడగొట్టారు. ఇరు జట్ల మధ్య గురువారం జొహన్నెస్‌బర్గ్‌లో చివరి టీ20 జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 19.3 ఓవర్లలో 180/7 (రింకూసింగ్ 68 నాటౌట్; సూర్యకుమార్ 56; కొట్జీ 3/32), **దక్షిణాఫ్రికా:** 13.5 ఓవర్లలో 154/5 (లక్ష్యం: 15 ఓవర్లలో 152) (హెన్రిక్స్ 49, మార్క్‌రమ్ 30; ముఖేశ్ 2/34).

రింకూ (68*)

కొసమెరుపు ఈ మ్యాచ్ ద్వారా నయా ఫినిషర్ రింకూ సింగ్ అంతర్జాతీయ టీ20ల్లో తొలి అర్ధశతకం నమోదు చేసుకున్నాడు. టాపార్డర్ తడబడటంతో.. పవర్‌ప్లేలోనే క్రీజులోకి వచ్చిన రింకూ.. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండ్రీకి తరలించి తన ఉద్దేశం చాటాడు. అయితే.. మరో ఎండ్ నుంచి సూర్యకుమార్ ధాటిగా ఆడుతుండటంతో తొలుత స్టయిక్ రొటేషన్‌కే పరిమితమైన రింకూ.. ఆ తర్వాత భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో ఫిఫ్టీ మార్క్ అందుకున్న రింకూ.. మార్క్‌రమ్ వేసిన 19వ ఓవర్‌లో వరుస బంతుల్లో రెండు సిక్సర్లు బాదాడు. అందులో చివరి సిక్సర్ దెబ్బకు స్టేడియం మీడియా గ్యాలరీ అద్దం బద్దలవడం కొసమెరుపు.

అండర్-19 ప్రపంచకప్‌లో అవినాశ్, అభిషేక్

భారత జట్టుకు ఎంపికైన హైదరాబాద్ క్రికెటర్లు

ముంబై: భారత క్రికెట్ జట్టులో హైదరాబాద్ ప్రాతినిధ్యం అంతకంతకూ పెరుగుతున్నది. ఇప్పటికే మహమ్మద్ సిరాజ్, ఠాకూర్ తిలక్ వర్మ టీమ్‌ఇండియా తరపున ప్రాతినిధ్యం వహిస్తుండగా తాజాగా జూనియర్ జట్టుకు అరవెల్లి అవినాశ్‌రావు, మురుగన్ అభిషేక్ ఎంపికయ్యారు. దక్షిణాఫ్రికా వేదికగా వచ్చే నెలలో మొదలయ్యే అండర్-19 ప్రపంచకప్ టోర్నీ కోసం సెలెక్టర్లు మంగళవారం భారత జూనియర్ జట్టును ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాదీ క్రికెటర్లు అవినాశ్, అభిషేక్ ఉన్నారు. జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న వీరిద్దరి ప్రదర్శనను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకున్నారు. ప్రస్తుతం దుబాయ్‌లో అండర్-19 ఆసియాకప్ ఆడుతున్న జట్టునే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన భారత జట్టుకు పంజాబ్ క్రికెటర్ ఉదయ్ సహ్రాన్ కెప్టెన్‌గా, స్వామికుమార్ పాండే వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. మెగాటోర్నీ కంటే ముందు దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌తో కలిసి యువ భారత్ ముక్కోణపు సిరీస్ ఆడనుంది. సఫారీ వేదికగా జరిగే ప్రపంచకప్‌లో గ్రూపు-ఎలో బంగ్లాదేశ్, ఐర్లాండ్, యూఎస్ఏతో కలిసి భారత్ పోటీపడనుంది. తమ తొలి మ్యాచ్‌లో జనవరి 20న బంగ్లాదేశ్‌తో టీమ్ ఇండియా తలపడుతుంది.

భారత అండర్-19 టీమ్: ఉదయ్ సహ్రాన్(కెప్టెన్), స్వామికుమార్(వైస్ కెప్టెన్), అవినాశ్‌రావు, ఇన్నేశ్ మహాజన్(వికెట్ కీపర్), అర్శిణ్ కులకర్ణి, ఆదర్శ్ సింగ్, రుద్రమ యూర్, సచిన్ దాస్, ప్రియాంశు మోలియా, ముషిర్‌ఖాన్, మురుగన్ అభిషేక్, ధనుశ్ గౌడ, ఆరాధ్య శుక్లా, రాజ్ లింబానీ, నమన్ తివారి. స్టాండ్‌బై: ప్రేవ్ దేవ్‌కర్, అన్ష్ గోసాయి, అమన్.

విజేత విదిత్

గబాల(అజర్‌బైజాన్) : భారత గ్రాండ్ మాస్టర్ విదిత్ గుజరాతి సోమవారం వగర్ గషిమోవ్ స్మారక చెస్ టోర్నెమెంట్‌ను గెలుచుకున్నాడు. రాపిడ్ విభాగంలో రెండు విజయాలు, ఒక పరాజయం, ఏడు డ్రాలతో రెండో స్థానంలో నిలిచిన విదిత్, బ్లిట్జ్ విభాగంలో 7/9 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచి ఓవరాల్‌గా 22 పాయింట్లతో టైటిల్‌ను దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన అర్జున్ ఇరిగేసి(21.5) అరపాయింట్ తేడాతో రెండో స్థానంలో, హంగరీ జిఎం రిచర్డ్ రాపోర్ట్ 19 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు.

24వ ర్యాంక్‌కు అశ్విని-తనీష

న్యూఢిల్లీ: ఇటీవల విశేష ప్రతిభ చూపిన భారత మహిళా షట్లర్లు అశ్విని పొన్నప్ప, తనీష క్రాస్టో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానానికి చేరుకున్నారు. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అశ్విని-తనీష నాలుగు స్థానాలు మెరుగయ్యారు. ఈ యేడాది జనవరిలో జత కట్టిన వీరు మొత్తం 16 టోర్నీలలో 44,590 పాయింట్లు సాధించారు. మరో మహిళా డబుల్స్ జోడి గాయత్రి గోపీచంద్-త్రిషా జాలి 49,435 పాయింట్లతో 19వ స్థానంలో కొనసాగుతున్నారు. పురుషుల డబుల్స్ జోడి సాత్విక్-చిరాగ్ శెట్టి 2వ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నారు. కాగా ప్రణయ్ 8, లక్ష్య సేన్ 17, శ్రీకాంత్ 24, సింధు 8వ ర్యాంక్‌లలో కొనసాగుతున్నారు.

సోమాజిగూడ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళవారం పరామర్శిస్తున్న యువ షూటర్ ఇషాసింగ్, ఆమె తండ్రి సచిన్‌సింగ్

రాజ్ లింబాని సూపర్ 7

- **సెమీస్‌లో యంగ్‌ఇండియా**
- **అండర్-19 ఆసియా కప్**

రాజ్ లింబాని (7/13)

దుబాయ్: మీడియం పేసర్ రాజ్ లింబాని (7/13) విశ్వరూపం చూపడంతో.. అండర్-19 ఆసియాకప్‌లో యువ భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పోరులో భారత్ 10 వికెట్ల తేడాతో నేపాల్ అండర్-19 జట్టును చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 22.1 ఓవర్లలో 52 పరుగులకు ఆలౌటైంది. ఒక్క బ్యాటర్ కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయాడు. నేపాల్ ఇన్నింగ్స్‌లో ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చిన 13 పరుగులే టాప్ స్కోర్ కావడం గమనార్హం. రాజ్ 7 వికెట్లు పడగొట్టగా.. ఆరాధ్య శుక్లా రెండు వికెట్లు తీశాడు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని భారత్ 7.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా ఛేదించింది. అర్షిన్ కులకర్ణి (43 నాటౌట్; ఒక ఫోర్, 5 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో మరో 257 బంతులు మిగిలుండగానే యంగ్ ఇండియా విజయం సాధించింది.

సెమీస్‌లో భారత్

హాకీ జూనియర్ ప్రపంచకప్

కౌలాలంపూర్: ప్రతిష్ఠాత్మక హాకీ జూనియర్ ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వార్టర్స్‌లో భారత్ 4-3తేడాతో నెదర్లాండ్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మ్యాచ్‌లో అర్ధభాగం ముగిసేసరికి 0-2తో వెనుకంజలో నిలిచిన యువభారత్ అద్భుతంగా పుంజుకుంది. మ్యాచ్ మొదలైన ఐదో నిమిషానికే టిమో బోర్స్ గోల్‌తో నెదర్లాండ్స్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరు కొనసాగిస్తూ వాన్‌డర్ హెజ్డెన్ గోల్ చేయడంతో డచ్ ఆధిక్యం రెట్టింపైంది. అయితే మూడు, నాలుగు క్వార్టర్‌లో ఆదిత్య(34ని), అరైజీత్‌సింగ్(36ని) గోల్ చేయడంతో స్కోరు 2-2తో సమమైంది. ఈ తరుణం ఒలీవర్(44ని) గోల్‌తో డచ్ పోటీలోకి వచ్చింది. మ్యాచ్ మరో పది నిమిషాల్లో ముగుస్తుందనగా సౌరభ్‌ఆనంద్(52ని), కెప్టెన్ ఉత్తమ్‌సింగ్(57ని) గోల్స్‌తో భారత్ చిరస్మరణీయ విజయం సాధించింది. సెమీస్‌లో జర్మనీతో భారత్ తలపడుతుంది.

వారియర్స్ దూకుడు

బెంగళూరు : ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 18 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. వారియర్స్ దూకుడుకు పైరేట్స్ సమాధానం చెప్పలేకపోయింది. ఆరంభంనుంచి వారియర్స్ ఆట గాళ్లు వరుస పాయింట్లు సాధిస్తూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. వారియర్స్ కెప్టెన్ మనిందర్ సింగ్ అత్యధికంగా 15 పాయింట్లు సాధించగా, నితిన్ కుమార్ 14, శ్రీకాంత్ 12 పాయింట్లతో సహకరించారు. పైరేట్స్‌కు సచిన్ 14, సుధాకర్ 14, సందీప్ కుమార్ 5 పాయింట్లు సాధించారు.

'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' సియాటెక్

సెయింట్ పీటర్స్‌బర్గ్ : సీజన్ ముగింపులో టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్న పోలండ్ టెన్నిస్ క్రీడాకారిణి ఇగా సియాటెక్ వరుసగా రెండో యేడాది 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును సొంతం చేసుకున్నది. సెరెనా విలియమ్స్ తరువాత ఈ అవార్డును వరుసగా రెండో యేడాది గెలుచుకున్న క్రీడాకారిణి సియాటెక్. కాగా సెరెనా ఈ అవార్డును వరుసగా నాలుగేండ్లు(2012-15) గెలుచుకోవడం విశేషం. ఈ యేడాది సియాటెక్ ఆరు ప్రధాన టైటిల్స్‌తోపాటు 68-11 గెలుపోటముల రికార్డును నమోదు చేసింది.

వాణిజ్య

భారత్‌కు ఉద్యోగ కల్పనే కీలకం

ఆర్బీఐ మాజీ గవర్నర్ రాజన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ఏకైక, అత్యంత ముఖ్యమైన ప్రెషర్ పాయింట్ ఉద్యోగ సృష్టేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రోహిత్ లంబాతో కలిసి 'బ్రేకింగ్ ది మోల్డ్: రీ ఇమాజినింగ్ ఇండియాస్ ఎకనామిక్ ఫ్యూచర్' అనే పుస్తకాన్ని రాజన్ రాశారు. ఈ సందర్భంగానే తాజాగా రాజన్ మాట్లాడుతూ.. భారత్‌కు కలిసొచ్చే గొప్ప అనుకూలాంశం జనాభేనన్నారు. అయితే దీన్నే తన బలంగా భారత్ ఎలా మార్చుకోగలదన్నదే ఇప్పుడు ప్రశ్న? అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటైన భారత్‌కు ప్రతీ స్థాయిలో ఉద్యోగ కల్పన చాలాచాలా అవసరమన్నారు. అందుకే తెలివైన విద్యావంతులను తయారు చేయగలిగితే వారి ద్వారా ఎన్నో ఉద్యోగాలను సృష్టించవచ్చని చెప్పారు. నైపుణ్యం, ప్రతిభకు పెద్దపీట వేయాలని, అప్పుడే నాణ్యమైన పనిమంతులను అందిపుచ్చుకోగలమని సూచించారు.

ఫోక్స్‌వ్యాగన్ ధరల పెంపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ప్యాసింజర్ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ కూడా ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల మాడళ్ల ధరలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు తెలిపింది. ఉత్పత్తి వ్యయం అధికమవడం తోపాటు కమోడిటీ ఉత్పత్తులు పెరగడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థ రూ.11.48 లక్షల నుంచి రూ.35.17 లక్షల లోపు ధర కలిగిన పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. మరో సంస్థ స్కోడా ఆటో ఇండియా కూడా వాహన ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా వాహన ధరలను రెండు శాతం సవరిస్తున్నట్టు తెలిపింది.

విజృంభించిన ద్రవ్యోల్బణం

- **3 నెలల గరిష్ఠానికి రిటైల్ ధరల సూచీ**
- **నవంబర్‌లో 5.55 శాతంగా నమోదు**
- **ఆహార ద్రవ్యోల్బణంతో దెబ్బ**
- **కూరగాయలు, తృణధాన్యాలు ప్రియం**

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ద్రవ్యోల్బణం మళ్లీ కోరలు చాచింది. ఇన్నాళ్లూ తగ్గుతూపోయిన రిటైల్ ధరల సూచీ గత నెలలో మూడు నెలల గరిష్ఠాన్ని తాకింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం నవంబర్‌లో 5.55 శాతంగా నమోదైంది. ఈ ఏడాది ఆగస్టులో 6.83 శాతంగా ఉన్నది. ఆ తర్వాత రెండు నెలలు తగ్గుముఖం పట్టగా, గత నెల తిరిగి ఎగువముఖం పట్టింది. అంతకుముందు నెల అక్టోబర్‌లో ఇది 4.87 శాతంగానే ఉన్నది. ఇక నిరుడు నవంబర్‌లో మాత్రం 5.88 శాతంగా ఉన్నట్టు మంగళవారం జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) విడుదల చేసిన గణాంకాల్లో తేలింది.

ఆహారోత్పత్తుల దెబ్బ..

కూరగాయలు, తృణధాన్యాలు తదితర ఆహారోత్పత్తుల ధరలు పెరగడం గత నెల రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ఎగదోసింది. సీపీఐలో 50 శాతం వాటా ఆహార ద్రవ్యోల్బణానిదే. ఈ క్రమంలో నవంబర్‌లో ఆహార ద్రవ్యోల్బణం 8.7 శాతానికి ఎగిసింది. అక్టోబర్‌లో 6.61 శాతంగానే ఉండగా, నిరుడు నవంబర్‌లో 4.67 శాతమేనని ఎన్ఎస్‌వో తెలియజేసింది. గత ఏడాదితో చూస్తే సుగంధద్రవ్యాల ధరలు వార్షిక ప్రాతిపదికన 21.55 శాతం పెరిగాయి. పప్పుధాన్యాలు తదితర ఉత్పత్తులు 20.23 శాతం, కూరగాయలు 17.7 శాతం, పండ్లు 10.95 శాతం, తృణధాన్యాలు ఇతరత్రా ఉత్పత్తులు 10.27 శాతం పుంజుకున్నాయి. అయితే వంటనూనెల ధరలు సుమారు 15 శాతం దిగాయి. ఇక రాష్ట్రాలవారీగా చూస్తే ఒడిశాలో అత్యధికంగా 7.65 శాతంగా ద్రవ్యోల్బణం నమోదైంది. అలాగే తెలంగాణ సహా మరికొన్ని రాష్ట్రాల్లో 6 శాతానికిపైగానే ఉన్నట్టు తేలింది. ఢిల్లీలో మాత్రం 3.1 శాతం కనిష్ఠ స్థాయి నమోదైంది.

ఆర్బీఐ పరిధిలోనే..

రిటైల్ ద్రవ్యోల్బణం 5.55 శాతంగా నమోదైనా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్దేశిత పరిధిలోనే ఉన్నది. ఆర్బీఐ 6 శాతాన్ని మించరాదన్న లక్ష్యం పెట్టుకున్నది. అయితే అక్టోబర్‌తో పోల్చితే పెరిగిన తీరును చూస్తే ఈ నెలకుగాను విడుదలయ్యే గణాంకాల్లో ఆర్బీఐ గీతను ద్రవ్యోల్బణం గణాంకాలు దాటిపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయనిపిస్తున్నది. ఇదే జరిగితే ఇన్నాళ్లూ ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్ల పెంపు జోలికి వెళ్లని ఆర్బీఐ మళ్లీ వడ్డింపుల్ని షురూ చేస్తుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో గృహ, వాహన తదితర రుణాలన్నీ భారం కావడం ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసిన సంగతి విదితమే. అక్టోబర్-డిసెంబర్‌లో 5.6 శాతంగా, జనవరి-మార్చిలో 5.2 శాతంగా ఉంటుందన్నది.

పారిశ్రామికం.. జోరు

అక్టోబర్‌లో దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు (ఐఐపీ) 16 నెలల గరిష్ఠాన్ని చేరింది. 11.7 శాతంగా నమోదైనట్టు మంగళవారం విడుదలైన ఓ అధికారిక ప్రకటన స్పష్టం చేసింది. తయారీ, విద్యుత్తు, గనుల రంగాల్లో రెండంకెల వృద్ధి ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. నిరుడు అక్టోబర్‌లో మైనస్ 4.1 శాతంగా ఉన్న విషయం తెలిసిందే. చివరిసారిగా గత ఏడాది జూన్‌లో 12.6 శాతం వృద్ధి కనిపించింది. మళ్లీ ఆ దరిదాపుల్లో గణాంకాలుండటం ఇదే తొలిసారి. ఇదిలావుంటే ఈ ఏప్రిల్-అక్టోబర్‌లో ఐఐపీ వృద్ధి 6.9 శాతంగా ఉన్నది. పోయినసారి 5.3 శాతమే. కాగా, ఈ ఏడాది సెప్టెంబర్ ఐఐపీ గణాంకాలను 6.2 శాతానికి సవరించారు. తొలుత 5.8 శాతంగానే అంచనా వేశారు.

వారంలో 3 రోజులు రావాలి

- **ఉద్యోగులకు ఇన్ఫోసిస్ అల్టిమేటం**

బెంగళూరు, డిసెంబర్ 12: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని స్వస్తి పలికేదిశగా అడుగులు వేస్తున్నది. ఇక నుంచి వారానికి మూడు రోజులు కార్యాలయాలకు తప్పనిసరిగా రావాల్సిందేనని ఉద్యోగులకు అల్టిమేటం జారీచేసింది. కార్యాలయాలకు వచ్చే సిబ్బందిని పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్న సంస్థ..అలాగే వృద్ధి మందగించడం, పనితీరు మెరుగుపరుచడాని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ విషయాన్ని ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించింది. మరోవైపు, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి వారానికి 70 గంటలు పనిచేయాల్సిన అవసరం ఉన్నదని ఇటీవల వ్యాఖ్యానించడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నది. ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు మాత్రం ఆఫీస్‌కు రావాల్సిన అవసరం లేదని, మిగతా వారు వారానికి మూడు రోజులు తప్పకుండా రావాలని ఆదేశించింది.

సూచీల లాభాలకు బ్రేక్

ముంబై, డిసెంబర్ 12: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్‌పడింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 377.50 పాయింట్లు తగ్గి 69,551.03 వద్ద స్థిరపడింది. చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న నిఫ్టీ చివరకు 21 వేల దిగువకు పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 90.70 పాయింట్లు కోల్పోయి 20,906.40 వద్ద ముగిసింది. సూచీలు కన్సాలిడేషన్ స్థాయిలో ఉన్నాయని, ముఖ్యంగా నవంబర్ నెలకుగాను రిటైల్ ధరల సూచీ గణాంకాలు విడుదలకానుండటంతో మదుపరులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా అమ్మకాలకు మొగ్గుచూపారు..ఫలితంగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన సూచీలు యూ-టర్న్ తీసుకున్నాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

టీ హబ్‌తో యూకే ఇండియా జట్టు

ఎమర్జింగ్ టెక్నాలజీస్ యాక్సిలరేటర్ కేంద్రం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ మార్కెట్‌తో సంబంధాలను కొనసాగించడానికి యూకే ఇండియా.. టీ హబ్‌తో జట్టుకట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఎమర్జింగ్ టెక్నాలజీకి పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని టీ హబ్‌లో యాక్సిలరేటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు టీ హబ్ ప్రతినిధి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కేంద్రంతో ఇక్కడి స్టార్టప్‌లను మరింత ప్రోత్సహించడానికి వీలు పడనున్నదన్నారు. ఇందులో ప్రధానంగా కృత్రిమ మేధస్సు, సెమికండక్టర్ పురోగతిపై పనిచేస్తున్న స్టార్టప్‌లకు పూర్తి స్థాయిలో సహకారం అందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఔత్సాహిక స్టార్టప్‌ల నిర్వాహకులు ఈ లింకు (https://bit.ly/ 3uGspmO) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

టీ హబ్ రూబ్రిక్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టీ హబ్ 4వ విడత రూబ్రిక్స్ కోహర్ట్ కార్యక్రమానికి శ్రీకారంచుట్టింది. ఆలోచన దశ నుంచి ప్రోటోటైప్ (నమూనా దశ) వద్ద కార్యకలాపాలు కొనసాగిస్తున్న స్టార్టప్‌లకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు టీ హబ్ వేదికగా రూబ్రిక్ యాక్సిలరేటర్‌ను ఏర్పాటు చేసింది. ప్రోటోటైప్ దశ నుంచి మినిమమ్ వయబుల్ ప్రొడక్ట్ దశ (ఎంవీపీ) వరకు ఆయా స్టార్టప్‌లకు ఈ కార్యక్రమం ద్వారా అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలకు ఈ లింక్‌లో (https://bit.ly/3Ratafw) సంప్రదించాలని తెలిపారు.

ఇక కొలువుల జాతర

జనవరి-మార్చిలో జోరుగా ఉద్యోగాలు

దేశంలోని 37 శాతం కార్పొరేట్లది ఇదే మాట

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: కార్పొరేట్ ఇండియా నియామకాల బాట పట్టబోతున్నది. వచ్చే ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలిచ్చేందుకు సంస్థలు సిద్ధమవుతున్నాయి మరి. మ్యాన్‌పవర్‌గ్రూప్ ఎంప్లాయిమెంట్ ఔట్‌లుక్ తాజా సర్వేలో 37 శాతం కంపెనీలు 2024 తొలి త్రైమాసికంలో భారీగా కొత్త ఉద్యోగాలివ్వబోతున్నట్టు సంకేతాలిచ్చాయి. దేశీయ కార్పొరేట్ వర్గాలు చెప్పినదాన్ని చూస్తే.. రాబోయే జనవరి-మార్చిలో ఔట్‌లుక్ (ఎన్ఈవో) భారత్‌లో మాత్రమే అత్యధికంగా ఉన్నట్టు తేలింది.

ఫైనాన్షియల్, రియల్టీ..

ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్ పరిశ్రమల్లో వ్యాపార పరిస్థితులు మెరుగ్గా కనిపిస్తున్నాయని ఈ సందర్భంగా మ్యాన్‌పవర్‌గ్రూప్ తెలిపింది. ఈ రంగాల ఔట్‌లుక్ గరిష్ఠంగా 45 శాతంగా ఉన్నది. 44 శాతంతో ఐటీ, 42 శాతంతో కన్జ్యూమర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ రంగాలు తర్వాతి స్థానాల్లో ఉన్నట్టు పేర్కొన్నది. 28 శాతంతో ఎనర్జీ అండ్ యుటిలిటీస్ ఆఖర్లో నిలిచాయి. కాగా, కొత్త ఉద్యోగాల విషయంలో అంతర్జాతీయ స్థాయిలో భారత్, నెదర్లాండ్స్ సంయుక్తంగా 37 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, 35 శాతంతో ఆ తర్వాతి స్థానంలో కోస్తారికా, అమెరికా నిలిచాయి. మెక్సికో 34 శాతంతో ఉన్నది. ప్రపంచ సగటు 26 శాతంగా ఉన్నట్టు మ్యాన్‌పవర్ గ్రూప్ చెప్పింది.

నైపుణ్యాన్వేషణలో..

నైపుణ్యాన్వేషణలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు సర్వేలో పాల్గొన్న 81 శాతం దేశీయ కంపెనీలు చెప్పడం గమనార్హం. ఈ కారణంగానే రవాణా, లాజిస్టిక్స్, ఆటోమోటివ్ రంగాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. తర్వాతి స్థానంలో ఐటీ రంగం ఉన్నది. కాగా, నైపుణ్య కొరత వేధిస్తున్న దేశాల్లో జపాన్ 85 శాతంతో ముందున్నది. ఆ తర్వాత జర్మనీ, గ్రీస్, ఇజ్రాయెల్ దేశాలున్నట్టు మ్యాన్‌పవర్‌గ్రూప్ చెప్పింది. ఇదిలావుంటే ఐటీ అండ్ డాటా, సేల్స్ అండ్ మార్కెటింగ్, ఇంజినీరింగ్